# సింధువులో బిందువులు

ఎరగని ఊళ్ళో మొరగని కుక్కలా దిక్కులు చూస్తుంటే అపరిచిత వ్యక్తి ఆత్మబంధువులా చెయ్యందుకున్నాడు. "హలో అయామ్ శంకర్. ఈమె నా భార్య ఉమ." ఆత్మీయంగా కరచాలనం చేశాడా యువకుడు. అతని పక్కనున్న అందాల యువతిని చూస్తుంటే యువకుడైన సాలగ్రాంలో యవ్వనోత్సాహం నిశ్శబ్దమైంది. దోరవయసు సింగారింపుల ఉమ చిరునవ్వు చిందించింది. కలువ కళ్లను కమ్మగా తిప్పుతూ "నమస్తే. మీరు గూడా మాలాగే హనీమూన్ కొచ్చినట్టుంది" అంటూ సాలగ్రాంకు భుజమానించి తననే చూస్తున్న శారద చెయ్యందుకుంది.

"అవునండీ!" సాలగ్రాంలో హుషారు. "ఈమె నా అర్ధాంగి శారద. నా పేరు సాలగ్రాం."

పడమటి కొండల్లోకి జారుకుంటున్న సూర్యకిరణాలు కిటికీలోంచి చొచ్చుకొస్తున్నాయి. మెగాసిటీ హైద్రాబాదు నడిబొడ్డున స్టార్ హోటల్లో గదులు బుక్ చేసుకున్న నవయువ జంటలు పాత స్నేహితుల్లా మాట్లాడుకుంటూంటే హోటల్ మానేజర్ ఉత్తమ కుటుంబ చిత్రాన్ని చూస్తున్న ప్రేక్షకుడయ్యాడు. కళ్ళజోడు సవరించుకుని "సార్! మీ గదుల్లో కెళ్ళండి" అంటూ అటెండర్‌కు తాళాలిచ్చాడు. మూడో అంతస్తులో అటెండర్ గదుల తాళాలు తీశాడు.

"మనవి పక్కా పక్కా గదులే." లోపలకెళ్ళబోయాడు శంకర్. సాలగ్రాం, శారద అయోమయంగా మొహాలు చూసుకున్నారు. ఆ చూపుల ఆంతర్యాన్ని పసికట్టిన ఉమ భర్తవైపు జరిగింది.

"పక్కపక్కా కాదండీ, పక్క పక్క గదులనాలి." నుదుటిమీది ముంగురుల్ని నాజుగ్గా సవరించుకుంది. "మీకభ్యంతరం లేకపోతే మనం కలసి తిరగొచ్చు గదా!" నీలం కళ్ళను తిప్పేసింది. శారద బలపరిచింది. ఉమ దంపతులు తెలుగువాళ్ళు కాదనిపించింది.

సాలగ్రాం - శారదలు అనంతపురం ఇంజనీరింగ్ కళాశాలలో క్లాసు మేట్లు. కాంపస్ సెలక్షన్లో ఒకేసారి ఇద్దరికుద్యోగాలొచ్చాయి. బెంగుళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఒకేరోజు జాయినయ్యారు. క్లాసులో కలుసుకున్న చూపులు కంపెనీలో ఆకట్టుకున్నాయి. గార్డెన్ సిటీలో పరిణతి చెంది మూడుముళ్ళ వేయించగా హనీమూన్‌లో హైద్రాబాద్ విశేషాలు చూడాలనుకున్నారు. శారద ఒడిలో సేదదీరుతూ సాలగ్రాం "వాళ్ల కట్టూ-బొట్టూ తెలుగువాళ్లలాగున్నా, నీలం కళ్లు, రాగి వెంట్రుకలు... ఈ దేశస్థులు కాదేమో" సందేహించాడు.

"కలిసి తిరుగుదామనుకున్నాం గదా. అప్పుడన్నా వాటంతటవే తెలుస్తాయి శారూ!"

❋ ❋ ❋ ❋ ❋

హైదరాబాద్ సందర్శన్‌లో మొదటిరోజు ఆటోల్లో వెళ్ళి సాలర్‌జంగ్ మ్యూజియం లో చొరబడ్డారు. గదుల విశేషాలు చూస్తూ శంకర్ - ఉమలు తమ నోటుబుక్కుల్లో కెక్కించుకున్నారు. ఓ గదిలో అలనాటి విశ్వసుందరి వీనస్ పాలరాతి విగ్రహం మగవారి నిగ్రహానికి పరీక్షగా కన్పించింది. ఆ తర్వాత క్యాంటీన్‌లో చాయ సేవిస్తున్నారు. చాయ నరాల్లోకి పాకుతూ ఉత్సాహాన్నిస్తుంటే సాలగ్రాం "వీనస్‌లాంటి బ్యాటీ ఫిగర్ ప్రపంచములో మరెక్కడా లేదు గదా!" ప్రస్తావించాడు.

"ఎందుకు లేదు?" శంకర్ కనురెప్పలు టపటపలాడినై. "కుమార సంభవములో కాళిదాసు పార్వతీదేవి అందాలను అద్భుతంగా వర్ణించాడు. ఆ శైలజ అందచందాల ముందు మిగతా వారంతా దిగదుడుపే. ఆ కావ్యాన్ని నేను శ్రీ వెంకటేశ్వర టెంపుల్ పూజారితో చెప్పించుకున్నాను."

ఇన్ఫిరియారిటీ కాంప్లెక్స్‌తో సాలగ్రాం కాస్సేపు నీళ్ళు నమిలాడు. వెంటనే సర్దుకున్నాడు. "ఇలాంటివి ఈ దేశంలో బోలెడున్నాయి. మీరు హంపీకెళ్ళి చూడాలి. కన్నడాంధ్ర భాషాకోవిధుడు విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయల కళాసంపద ఈ లోకాన్ని మరపింపజేస్తుంది."

"హంపీ గూడా మా టూర్‌ప్రోగ్రాములో ఉన్నది ఫ్రెండ్!" శంకరన్నాడు. మిగతా గదులన్నీ చూసి తృప్తిగా బయటికొచ్చారు.

రాత్రి భోజనాలప్పుడు "మాదీప్రాంతమే కాని ఉద్యోగాలు బెంగుళూర్లో. అక్కడే పెళ్ళి చేసుకున్నాం" అంది శారద ఎదుటివారి కూపీ లాగాలని.

"మరి మీదేప్రాంతము మిత్రమా? ఈ దేశస్తులేనా?" నెయ్యన్నంలో ఆవకాయ కలుపుతూ అడిగాడు సాలగ్రాం. ఉమాశంకర్ల కళ్ళలోని మెరుపు పెదాలమీద చిందులేసింది.

"నేను పుట్టి పెరిగింది అమెరికాలో" అన్నంలో సాంబారు కలుపుతోంది ఉమ. ట్యూబులైటు వెలుతురుకు పెదాలు తళుక్కుమన్నాయి.

"నేను అమెరికన్‌నే. యూనివర్సిటీలో తెలుగు నేర్చుకున్నాను" శంకర్ ఆనందం. "అమెరికన్ తెలుగు సంఘాల ఫ్రెండ్స్ గూడా చాలా నేర్పారు. రియల్లీ తెలుగు మంచి స్వీట్ లాంగ్వేజ్" భార్యవైపు చూశాడు.

"మాది న్యూజెర్సీ సిటీ" ఉమ అందుకుంది. "మా అపార్ట్‌మెంట్స్‌లో తెలుగు కుటుంబాలెక్కువున్నాయి." ఒంటిపరుస బంగారు గొలుసు గుండెల మీదాడుతోంది. "వాళ్లవల్లనే తెలుగు బాగా వంటబట్టింది. యూనివర్సిటీలో స్క్రిప్టు నేర్చుకున్నాను. మేమక్కడే పరిచయాలు పెంచుకొని మనసులు కలుపుకున్నాము."

"ఇండియన్ కల్చరనే మాగ్నెట్‌కు మేము మెటల్ ముక్కల్లా అట్రాక్టయాము. వేదమంత్రాలతో మా పెళ్ళి శ్రీ వేంకటేశ్వర టెంపుల్లో జరిగింది. "పతంజలి యోగా క్యాంపులో యోగా నేర్చుకున్నాము. సౌతిండియన్ కల్చర్ అండ్ హెరిటేజ్ సబ్జెక్టులో చెరో యాంగిల్‌లో రీసెర్చ్ చేస్తున్నాం" ఉదాత్తంగా మెరుస్తున్న ఉమ కుంకుమ బొట్టును తదేకంగా చూస్తున్నాడు శంకర్.

❋ ❋ ❋ ❋ ❋

రెండవరోజు టాక్సీలో వెళ్ళి గోలకొండ కోటలో అందరిలాగే ఈ రెండు యువజంటలు గూడా గైడువెంట పరుగెడుతున్నాయి. విశేషాలను నోటుబుక్కుల్లో కెక్కిస్తూ ఫోటోలు తీస్తున్నారు ఉమ దంపతులు. బంధిఖానాలో భక్తరామదాసు అనుభవించిన శిక్షలను గైడు వర్ణిస్తూంటే గుండె చెరువైపోయింది. ఆనాటి అన్ని హంగులు సమకూర్చుకున్న రాణివాసాన్ని చూస్తూ "కుతుబ్‌షాహీ నవాబులకు కుడిఎడమ భుజాల్లాగున్న అక్కన్న-మాదన్నలు ధన్యజీవులు." ఉద్వేగాన్నాపుకోలేకపోయాడు సాలగ్రాం.

"అక్కన్న మాదన్నల నిజాయితీ గురించి ఇంగ్లీషు పుస్తకంలో చదివాను." శంకర్‌కేదో గుర్తుకొచ్చింది. "ఆ ఇద్దరు మంత్రులతో ఎన్నో సేవలు చేయించుకున్న పాదుషా వాళ్ళిద్దరిని నడిబజార్లో మర్డర్ చేయించాడు గదూ!"

సాలగ్రాం - శారదలు మొహాలు చూసుకున్నారు. ఈ విషయాన్ని మన చరిత్రకారులు దాచిపెట్టారని సైగలు చేసుకున్నారు.

"ఈ చరిత్రలు మనకెందుకులే!" సాలగ్రాం పెదవి విరిచాడు.

"తమ దేశచరిత్రను మరిచిన ప్రజలున్న దేశము తన అస్తిత్వాన్నే కోల్పోతుందన్నారు." నవ్వుతూ సాలగ్రాం భుజం తడిమాడు శంకర్.

చివరగా గోల్కొండ నవాబుల కమ్యూనికేషన్ వ్యవస్థను పరీక్షించారు. గైడు ఓ జంటను కోట ప్రవేశ ద్వారములో ఉంచి మరో జంటను కోట లోపలున్న బంగళాపై అంతస్తులో ఉంచి చప్పట్లు చరిపించాడు. ఒకరి చప్పట్లు ఇంకొకరికి స్పష్టంగా వినబడినై. రెండు జంటల మధ్య అరకిలోమీటరు... దూరముంది.

రాత్రిభోజనాలు ముగించి గంపకింది కోళ్ళలా గదుల్లో దూరిపోయారు. భర్త ఎదమీద సేదదీరుతూ "ఈ ఫారినర్స్ అసాధ్యుల్లాగున్నా" రంది శారద.

"నిజమే అంత దూరన్నుండి వచ్చి పరిశోధనలు చెయ్యడమంటే మాటలు కాదు గదా!"

ఇంతలో సాలగ్రామ్ వద్ద సెల్‌ఫోన్ మ్రోగింది - అవతలివైపు శంకర్. "ఇక్కడ కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ ఉందట. మీకు తెలుసా?"

"ఉందని విన్నాను. నేను ఎప్పుడూ వెళ్ళలేదు. ఇప్పుడు దానితో ఏమి పని?"

"బెంగుళూరులోఉన్న మా ఫ్రెండ్ సుదర్శన్ చెపుతున్నాడు - మ్యూజియంలు, కోటలు, జూలాజికల్ పార్కులు చూడొచ్చు. కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ లాంటిది మరొకటి చూడలేవు. హైదరాబాద్‌లో నాలుగురోజులు ఉండి కూడా మీలాంటి వాళ్ళు దానిని చూడకుండా వచ్చేస్తే మీ ట్రిప్ వేస్టయినట్లే అంటున్నాడు."

"అయితే రేపటి ప్రోగ్రాంలో దానిని తప్పక ఇంక్లూడ్ చెయ్యాలంటారు అంతేనా? నేను ఈ ఊళ్లో ఉన్న మా బంధువులనడిగి వివరాలు తెలుసుకొని మళ్ళీ ఫోనుచేస్తాను" సాలగ్రామ్ ఫోన్ కట్‌చేసి, తమ బాబాయిగారి అబ్బాయి గోవిందరావు నంబరు దయల్‌చేశారు. రెండుమూడు నిమిషాలు మాట్లాడి, ధన్యవాదాలు చెప్పి మళ్ళీ సాలగ్రామ్‌కు రింగ్ ఇచ్చాడు.

"సాగర్ రోడ్‌కి దగ్గరగా ఉన్న రింగ్‌రోడులో ఉందట ఆ టెంపుల్. రేపు మనం వెళ్ళాలనుకున్నది రామోజి ఫిల్మ్‌సిటీయే గదా! ముందు కర్మన్‌ఘాట్ అంజనేయసావమిని దర్శించుకొని రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లవచ్చునని మా బాబాయిగారి అబ్బాయి సలహా ఇచ్చాడు. కాస్త ఎర్లీగా, అంటే 6 గంటలకే బయల్దేరవలసి ఉంటుంది, సరేనా?"

"తెలిసినవారు మీరు ప్లాన్ చేస్తుంటే కాదనేదేముంది. అలాగే చేద్దాం."

❋ ❋ ❋ ❋ ❋

సుప్రభాత సూర్యకాంతులు దేవాలయ శిఖరానికి బంగారు పూతలు పూస్తుంటే యువజంటలు చెట్టాపట్టాలేసుకుని కర్మన్‌ఘాట్ అంజనేయస్వామి ఆలయప్రాంగణములో ప్రవేశించాయి. విశాల ప్రాంగణం

ఆధ్యాత్మిక భావాల కాటపట్టులాగుంది. మొదట వినాయకుడిని దర్శించుకున్నారు. తర్వాత శ్రీరామబంటు శ్రీ అంజనేయస్వామి సన్నిధికి చేరుకున్నారు. మనసు మలినాలను తొలగించి భక్తుల కష్టాలను కడతేర్చేందుకు నేనున్నాని అభయహస్త మిస్తున్న అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తిభావంతో నిండుకుండల్లాగైన మనసులతో జగన్నాథుడిని దర్శించుకున్నారు. జగన్నాథాలయం, ప్రధానాలయం మధ్యలో కొమ్మలు రెమ్మలుగా విస్తరించిన రావి చెట్టు చల్లని నీడలో కొద్దిసేపు ధ్యానంలో గడిపారు.

ప్రాచీన కళావైభవాలు కళ్లకు కడుతున్న పొడగాటి రాతి ధ్వజస్తంభాన్ని, రాతిస్థంభాల మంటపాలను మనసారా చూశారు. వాటి విశేషాలు ఉమ, శంకర్‌ల కెమెరా, నోటుబుక్కుల్లో కెక్కాయి. ఏసి. గదిలాగున్న విశాలమైన జగన్నాథాలయ మంటపములో కూచుండి ప్రసాదాలారగిస్తూ రంగుల హంగులు విరజిమ్ముతున్న ఆలయ శిఖరమ్మీది విగ్రహాలను వీక్షించారు. తన్మయంగా ఊపిరి పీల్చుకున్నారు.

"వాళ్ళవన్నీ ఎందుకు రాసుకుంటున్నారో!" భర్త చెవిలో అడిగింది శారద. నాకేందెల్సూ అన్నట్టుగా భుజాలెగిరేశాడు సాలగ్రామ్.

"ఈ దేవాలయం చాలా పాతది గదా!" ఉమ ప్రస్తావించింది.

అప్పుడే అటువైపొచ్చిన ఆలయాధికారి తనను తాను పరిచయం చేసుకుని "మీరెవరండీ?" అడిగాడు. నలుగురు తమ పరిచయం చేసుకున్నారు.

"మాదో రిక్వెస్ట్ సార్!" శంకర్ ఆసక్తి.

"చెప్పండి సార్!" ఆలయాధికారి వారిముందు కూచున్నాడు.

"ఈ టెంపుల్ హిస్టారికల్ బ్యాక్ గ్రౌండేమిటి సార్?"

"అంతేనా! ఏదో ఫిర్యాదనుకున్నాను" అధికారి సర్దుక్కూర్చున్నాడు "ఐతే వినండి." ప్రారంభించగానే శంకర్-ఉమల నోటుబుక్కులు, కలాలు తెరుచుకున్నాయి.

"సుమారు తొమ్మిదివందల సంవత్సరాల క్రితమిదో దుర్గమారణ్యం. ధర్మప్రభువులు కాకతీయ రాజుల పాలనలో ఉండేది. గోలకొండ దుర్గాన్ని నిర్మించాలనే సంకల్పముతో ప్రతాపరుద్ర మహారాజు 1143వ సంవత్సరంలో ఇక్కడికి సైన్యముతో వచ్చారు. వేటలో అలసి విశ్రమించారు. అప్పుడే కొద్దిదూరు నుండి పులి అరుపు వినబడింది. దాన్ని వేటాడేందుకు ఒంటరిగా వెళ్ళారు. ఎంతదూరం వెళ్ళినా పులి కనబడలేదు. కాని చెట్ల పొదల నుండో శబ్దము వినబడింది. మహారాజు అటువైపు వెళ్ళి చూశారు. చెట్లపొదల్లో పద్మాసనం వేసుక్కూచున్న అంజనేయస్వామి ప్రతిమ కనబడింది. అది దివ్యతేజస్సులు వెదజల్లుతోంది. తనకో ఆశ్రమాన్ని నిర్మించాలని ఆదేశించింది. మహదానంద భరితుడైన మహారాజు వెంటనే స్వామికో మందిరాన్ని నిర్మించారు. కొన్ని ఎకరాల భూముల్ని ఆలయ నిర్వహణకు కేటాయించి నిత్యపూజలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత ఎందరో రాజులు ఆలయాభివృద్ధి చేస్తూ సర్వాంగ సుందరముగా తీర్చిదిద్దారు.

17వ శతాబ్దములో ఔరంగజేబు దేవాలయాలను ధ్వంసంచేస్తూ ఇక్కడికొచ్చాడు. ఈ దేవాలయాన్ని పడగొట్టేందుకు సైన్యాన్ని పంపించాడు. కాని ఆ సేనలు దేవాలయ సరిహద్దుల్ని దాటి లోనికి రాలేకపోయినై. తానే స్వయంగా ఆలయ ధ్వంసం చేస్తానని ఔరంగజేబు సైన్యసమేతంగా వచ్చాడు. అతడు సింహద్వారం చేరుకోగానే భయంకరమైన శబ్దం వినబడింది. అది చెవులు చిల్లులుపడేలాగుంది. "హే రాజన్! మందిరాన్ని పడగొట్టేముందు 'కరో మన్‌ఘట్'

అంటే మనసు గట్టిపరుచుకొమ్మని గర్భగుడిలోంచి వినబడింది.

"అయితే నీ మహిమను చూపించు"మన్నాడు ఔరంగజేబు.

వెంటనే ఆలయంనుండి మెరుపులు మెరిసినై. దివ్యకాంతి పుంజాలు తాటిచెట్టంత ఎత్తుగా విరజిమ్మాయి. అందులో వీరాంజనేయస్వామి ఉగ్రరూపం కనబడింది. హిందూధర్మనాశనానికి కంకణధారియైన ఔరంగజేబు తోక ముడిచాడు. ముందుకుపోయే ఆలోచనలు వదిలి వెనుదిరాగాడు. అప్పట్నుంచది కర్‌మన్‌ఘాట్‌గా, కర్మన్‌ఘాట్‌గా ప్రసిద్ధమైంది."

"చాలా థ్యాంక్స్ సార్!" సాలగ్రాం కృతజ్ఞతలు తెలిపాడు.

"ఆనాడే అంతటి టెక్నాలజీని జీర్ణించుకున్న భారతీయసంస్కృతి రియల్లీ సూపర్!" శంకర్‌మోహం ప్రాతఃకాలపు పొగమంచులో సూర్యకిరణంలా మెరిసింది.

రామోజీ ఫిలింసిటీలో విహరిస్తున్నారు. సినీ నిర్మాతలు డబ్బులతో లోపలికొచ్చి తయారైన సినిమా రీళ్ళతో బయటికెళ్ళేందుకు అన్ని హంగులున్న సినీ ప్రపంచమది. తాము చూసిన ఏయే సిన్మాలు ఏ స్పాట్‌లో షూటింగైనాయో శారద-సాలగ్రాంలు వివరిస్తూంటే శంకర్-ఉమలు చిన్నపిల్లల్లా గంతులేశారు.

మర్నాడు వరంగల్‌కు రైల్లో వెల్తూ కిటికీలనుండి ప్రకృతి పరవశింపుల్నిచూస్తూ పులకిస్తున్నారు. మక్కచేను మంచెమీద ఒడిశెల తిప్పుతున్న పల్లెపడుచు జానపద గీతము కమ్మగా వినబడింది.

"వెరీనైస్!" శంకర్ కేరింతలు.

"బ్యూటీఫుల్." ఉమ గలగలా నవ్వింది. ఆ నవ్వు మంచుకొండమీద పున్నమి వెన్నెల చిలికినట్టుంది. ఆ దృశ్యము శంకర్ కెమెరాలో నిక్షిప్తమైంది.

"ఓ విషయం మీరు తెలుసుకోవాలి" ఉల్లాసంగా ప్రారంభించాడు సాలగ్రాం. "ఈ దేశం సిరిసంపదలతో తులదూగుతుండేది. అందుకే దీన్ని బంగారు పక్షి అన్నారు. ఇక్కడి ధనరాశుల్ని ఘోరీ, గజనీ, నాదిర్షా, ఇంగ్లీషు, ఫ్రెంచి వాళ్ళెందరో దోచుకుపోయారు...."

వెంటనే అంది ఉమ "ఎవరెంత దోచుకుపోయినా ఈ దేశ ఆధ్యాత్మిక - సాంస్కృతిక సంపదలనెవ్వరూ దోచుకోలేకపోయారు" ముక్కుపుడక వెలుతురు నుదుటి బొట్టులో మెరిసింది.

పక్కసీట్ల వాళ్ళంతా వీళ్ళనే చూస్తున్నారు.

"ఇప్పటికీ భారతదేశములో పేదలుండొచ్చుకానీ ఇది పేద దేశము కానే కాదు" శంకర్ అన్నాడు. ముంగురులు మోహాలమీద ఆడుకుంటూంటే ఉమ-శారదలు మునివేళ్ళతో సర్దుకున్నారు.

* * * * *

రామప్ప దేవాలయం చుట్టూ తిరుగుతూ సాలభంజికల నాట్యవిన్యాస శిల్పాలను, కాకతీయుల కళాతృష్ణను ఆసక్తిగా తిలకించారు. అపురూపమైన శిల్పసంపదలో జీవం ఉట్టిపడుతోంది. పేరిణి శివతాండవ శిల్పాలు, రతీమన్మథుల శృంగార శిల్పాలు సంతోష సాగరములో మునకలు వేస్తున్నాయి. రామప్ప చెరువు నీటిలో తేలిన పెద్ద ఇటుకలను ప్రత్యక్షంగా చూశారు. చెరువు కట్టమీద కూచుని బిస్కెట్లు తింటున్నారు. ప్రకృతి పరవశింపుల్లో జోరుగాలికి గాలిపటాల్లా పైకిలేచిన పైటలను సవరించుకుని బొడ్లో దోపుకుంటూంటే ఉమ-శారదల బుగ్గలు నునులేత సిగ్గుల్ని సంతరించుకున్నాయి. చల్లనిగాలి కన్నతల్లి హస్తస్పర్శలా ఒంటిని తడుముతోంది.

"అన్నట్టూ.... దేవాలయాల్లో బూతుబొమ్మలెందుకో?" ఉన్నట్లుండి ప్రశ్నించాడు శంకర్. ఉమ చెంపలు కెంపులైనాయి. శారద కనుబొమ్మల కదలికలు సాలగ్రాంను తట్టాయి. అతడందుకున్నాడు.

"మనిషి మనుగడకు ధర్మార్థ కామమోక్షాలనే పురుషార్థాలున్నాయి. అవి జీవితములో పాటించాల్సిన విధుల్ని చెబుతున్నాయి. అర్థము అనగా డబ్బును ధర్మబద్ధంగా సంపాదించాలి. అవసరాలకు మించిన సంపదలను పేదలకు పంచాలి. సృష్టికి మూలమైన నర-నారీ సంయోగము ధర్మబద్ధంగా జరగాలి. ఆ పవిత్రకార్యము పశుప్రవృత్తిగా మారితే వైద్యానికి లొంగని రోగాలొస్తాయి. ఒక స్త్రీకి ఒకే పురుషుడనే నిబంధన ఆచరణ యోగ్యమైంది. ఇలా ధర్మబద్ధంగా జీవితం గడిపితేనే మోక్షంలభిస్తుంది." శంకర్‌దంపతుల మొహాలు తృప్తిగా వెలిగాయి.

వేయిస్తంభాల గుడిచుట్టూ తిరుగుతూ కాకతీయ చక్రవర్తుల కళాహృదయాలను శిల్పసంపదలో చూస్తున్నారు. గుడిమీది వరుసలోని మైథున శిల్పాలు కూడా కెమెరాల్లో కెళ్ళాయి.

"ఇలాంటి శిల్పాలు దేవాలయాల్లోనే ఎందుకుండాలి?" శంకర్ ప్రస్తావించాడు.

సాలగ్రాం ఊపిరి పీల్చుకున్నాడు. "వెనకటి రోజుల్లో దేవాలయాలే ప్రజాసేవా కేంద్రాలండీ. యుక్తవయసులో మాత్రమే శృంగారం సంగతి తెలుసుకోవాల్సి వచ్చేది. విద్య-వైద్యకేంద్రాలు కూడా దేవాలయాలే. లోకజ్ఞానం తక్కువున్న యువత అవగాహన కోసం ఈ శిల్పాలను దేవాలయాల్లోనే ఏర్పాటు చేశారు. సృష్టికార్యం గురించి తెలియనివారికి తెలియజెయ్యడమే కాకుండా తెలిసినవారి స్థితప్రజ్ఞతకిదో పరీక్షా కేంద్రము గూడా".

అందరూ ఆస్తకిగా విన్నారు.

కమ్మని తెలుగువంటకాలతో భోంచేసి హైదరాబాదు రైలెక్కారు. అసలు విషయం తెలుసుకుందామా అన్నట్టుగా శారదను సైగతో అడిగి సరేనన్పించుకున్నాడు సాలగ్రాం. ఎక్స్‌ప్రెస్ రైలు వేగంగా పరుగెడుతోంది. కాస్సేపు పక్కవారితో మాట్లాడి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

"మీ ఒరిజినల్ పేరు తెలుసుకోవచ్చా శంకర్‌గారూ?" సాలగ్రాం పెదాల మీదో చిరునవ్వు.

"ఓ యస్. నా ఒరిజినల్ నేమ్ శామ్యూల్. నేనే శంకర్‌గా మార్చుకున్నాను."

అదే ప్రశ్నాబాణం తనదాకా వస్తుందని ఉమ కర్థమైంది. నా అసలుపేరు షకీలా. మా అపార్ట్‌మెంట్స్‌లోని తెలుగువారంతా ఉమ అని పిలిచేవారు. నాకదే బాగన్పించింది."

"మీ పెళ్ళికి పెద్దలొప్పుకున్నారా?" సూటిగా అడిగాడు సాలగ్రాం.

"అడగవలసిన ప్రశ్నే అడిగారు. మా పెద్దల్ని ఒప్పించడానికి కొంచెం కష్టపడవలసి వచ్చింది. అయితే ఇద్దరం ఒక అవగాహనతో ఉన్నాంగనుక, కొంచెం టైమ్ తీసుకున్నా. వారిని ఒప్పించటంలో సక్సెస్ అయ్యాం."

"కొంచెం వివరంగాచెప్తారా? - మీకు అభ్యంతరం లేకపోతేనే సుమండీ."

"మీరు కొంచెం ఓపికగా వినవలసి ఉంటుంది. నేను వీలయినంతగా కుదించి చెప్తాను. ఏదిఏమైనా మేము ఇద్దరం పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. కొంచెం ఆలస్యమైనా పెద్దల యాక్సెప్టెన్స్‌తో చేసుకోవాలనుకున్నాం. మా యిళ్ళనుండి దూరంగా పారిపోయి పెళ్ళిచేసుకునే పద్ధతి వద్దనుకున్నాం. దానిలో భాగంగా మా స్నేహితుల కథలు చెపుతున్నట్లుగా మా పెద్దవాళ్ళతో ఇంటర్ రిలీజియస్ మేరేజస్ గురించి మాట్లాడుతూ

ఉండేవాళ్ళం. మనం మనమతం వాళ్లనే చేసుకోవాలని మా పేరెంట్స్ చెప్పేవారు. ఒకరోజు మా అమ్మ "ఒరేయ్ అంతగా అయితే హిందువుల అమ్మాయిని మన దారికి తెచ్చుకోవచ్చు. నెమ్మదినెమ్మదిగా, పెళ్ళికి ముందో, తరవాతనో ఆ అమ్మాయిని మనమతంలోకి తెచ్చుకోవచ్చు. ఒకవేళ ఆ అమ్మాయి ఫార్మల్‌గా మతంలోకి రాకపోయినా, పెద్దప్రమాదమేమి ఉండదు. మనతో కలసి ఉండటంలో, మనకి లాయల్‌గా ఉండటంలో తేడారాదు కాని పొరబాటునకూడా ముస్లింపిల్లను చేసుకోవాలనుకోకూడదు. ఎందుకంటే శతబ్దాలుగా వాళ్లకి మనకి ఘర్షణలు - నీకు తెలుసుగదా - క్రూసేడులవంటి యుద్ధాలు జరుగుతున్నాయి. ఆ పిల్లను మనమతం లోకి వచ్చేట్లుగా ఒప్పించటం జరిగే పనికాదు. మనమతంలోకి రాకుండా ఇంట్లోకి వచ్చేపిల్ల మనకి ఒదిగి ఉంటుందనీ అనుకోలేము - ఈ వివరాలన్నీ మీ ఫ్రెండుకి వివరంగా చెప్పు" అంది. నేను మా నాన్నగారి ముఖంలోకి చూశాను. ఆయన చూపుల్లో ఏకీభావం కనబడింది.

నేను ఈ సంభావణ అంతా ఉమకు - అంటే ఇప్పటి షకీలాకు చెప్పాను.

"ఆ తర్వాత విషయం నేనే చెప్తాను..." ఉమ అందుకొంది. "నేనుకూడా మా స్నేహితురాలి సమస్య చెపుతున్నట్లుగా మొదట మా అమ్మదగ్గర, తర్వాత అమ్మానాన్నలిద్దరూ ఉండగా - అమాయకంగా ప్రశ్నించాను. విచిత్రంగా వారి రియాక్షన్‌కూడా ఇలాగే ఉంది. "క్రిష్టియన్లు వాళ్ళ మతప్రచారానికి ఎంతడబ్బు ఖర్చుపెడుతున్నారో చూస్తున్నావుగదా! ఇండియా, శ్రీలంకవంటి కొన్ని ఏషియన్ కంట్రీలలో ఆదివారాలలో అదేపనిగా బైబిల్ చేతిలో పట్టుకొని తిరుగుతుంటారు. కనిపించిన ప్రతీవ్యక్తినీ ఏదోవిధంగా ట్రాప్‌చేసి తమ మతంలో చేర్చుకోవాలనుకుంటారు. వారు చిన్నప్పటినుండి తమపిల్లలకు - ఇతరమతాల దేవుళ్ళు సైతాన్‌లని, వారి దేవుళ్ళ ప్రసాదాలు ముట్టుకోవద్దని నూరిపోస్తారు. అలాంటి వారితో మనకు పొసగదు. హిందువులతో ఇంటర్ రిలీజియస్ మేరేజీ కొంత నయం. ఆహారం అలవాటు తేడా లేకపోతే, సర్దుకుపోవటం అంత కష్టంకాదు. హిందూ కుర్రవాడు మనపిల్లను నిజంగా ప్రేమించినట్లయితే, తన బంధువులందరిని వదులుకొంటానని సిద్ధపడతాడుగాని, ప్రేమించిన పిల్లను నట్టేట ముంచడు. కావాలనుకొన్నప్పుడు నయాన, భయాన హిందూకుర్రవాడిని మన మతంలోకి తెచ్చుకోవటమూ పెద్ద సమస్యకాదు"అన్నారు.

నేను ఈ విషయమంతా విపులంగా శంకర్‌కి చెప్పాను. ఇది వారు క్యాజువల్‌గా ఎవరికోసమో చెప్పిన సలహాగా కాకుండా - తమ పిల్లల విషయంలోనైనా, వారు చెప్పిన విధానానికి కట్టుబడి ఉండేటట్లుగా రెండువైపుల పేరెంట్స్‌ని గట్టిగా కమిట్‌చేయించాలనుకున్నాం. మరో రెండునెలలు - ఏదో కథ చదివినట్లుగానో, మరో ఫ్రెండ్ పెళ్ళిగురించిన సమస్యవచ్చినట్లుగానో చెప్పి,వారినోట ఇవే మాటలు మళ్ళీ మళ్ళీ పలికించాం. ఈలోగా మాకున్న హిందూ స్నేహితులద్వారా అక్కడ ఉన్న హిందూరిలీజియస్ ఇనిస్టిట్యూషన్స్‌ని సంప్రదించాం. శామ్యూల్ శంకర్‌గా, షకీలా ఉమగా హిందూధర్మంలోకి ప్రవేశించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నాం. మా మతాలను మార్చుకొంటూ - దానిపై అధికారిక ముద్ర పడడానికి ముందే మేమిద్దరం హిందువులమేనని - మనసా, వాచా, కర్మణా భావిస్తూ వ్యవహరిస్తూ వచ్చాం."

"ఆ తర్వాత షకీలా అదే ఉమ నన్ను తన పేరెంట్స్‌కి పరిచయం చేసింది. నేను ఉమను మా పేరెంట్స్‌కి పరిచయం చేశాను. కుదురుగా ఉన్న ఈ హిందూ యువతీయువకులను చూసి వారు ముచ్చటపడ్డారు. ముగ్ధులయ్యారు. సైద్ధాంతికంగా ముందే కమిట్ అయ్యారు కాబట్టి మా వివాహానికి అడ్డు చెప్పేందుకు కారణమేమి మిగల్లేదు.

మా పెళ్ళి వెంకటేశ్వర టెంపుల్‌లో జరిగింది. ఈలోగా ఒక విచిత్రం జరిగింది. మా ఇంట్లో మా అమ్మానాన్నల మధ్య, వాళ్లయింట్లో తన అమ్మానాన్నల మధ్య చాలా చాలా చర్చ జరిగింది. నేను మాయింట్లో ఒకే ఒక్క సంతానం. శంకర్ వాళ్ళ యింట్లో పెద్ద సంతానం. అతని తరువాత చెల్లెలు, అతనికంటే ఎనిమిదేళ్ళు చిన్నది. మా వివాహం ఇన్విటేషన్లు మేము మా మా బంధువులకూ స్నేహితులకూ విన్త ృతంగా పంచాము. ఇన్విటేషన్ అచ్చుయేటప్పుడు మా మా తల్లిదండ్రుల అంగీకారంతోనే పెళ్ళిజరుగుతున్నదని వివరించి చెప్పాము. బహుశా బంధువుల నుండి ఆరాతీస్తూ అడిగిన ప్రశ్నలు, అందజేసిన అభినందనలూ, ఒకటి రెండు ఈసడింపులూ వారిని బాగా ఆలోచింపజేశాయి. మాపెళ్ళికి మూడు రోజులముందు శంకర్ పేరెంట్స్ హిందూధర్మాన్ని స్వీకరించారు. అది తెలిసిన మా పేరెంట్స్ కూడా పెళ్ళికి ఒక రోజు ముందు హిందూధర్మాన్ని స్వీకరించారు. ఇదంతా కలా, నిజమా అని మేము మా స్నేహితులూ ఆశ్చర్యపోయాం.

ఇక్కడ ఉన్న క్రైస్తవులు, మహమ్మదీయులు తమ గ్రంథాలకే పరిమితమవుతున్నారు. ఇతరుల ఆచారవ్యవహారాలను, పురాణగాధలను తెలుసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. లేదా చులకనభావంతో వ్యాఖ్యానిస్తున్నారు. కాని ఈనాడు అమెరికాలో పరిస్థితి భిన్నంగా ఉంది. అందరూ ఇతరమతాల ఆచార వ్యవహారాల గురించి, పురాణగాథల గురించి, వారి విశ్వాసాలను గురించి ఎంతో కొంత తెలుసుకొంటున్నారు. అమెరికాలో అన్నిరంగాలలో, వృత్తులలో అగ్రగాములుగా ఉన్నవారు భారతీయులు, హిందువులు. వారితో నేరుగా సంబంధం లేనివారు ఉండరు. హిందువులు తమ ఆచారాలను పండుగలను పాటించటంలో, వాటిని ప్రముఖంగా సెలబ్రేట్ చేసుకోవటంలో శ్రద్ధవహిస్తున్నారు. అందుకే వైట్‌హౌస్‌లో దీపావళి పండుగ జరుగుతోంది. ఈ వాతావరణంలో అమెరికన్‌లందరికీ హిందుధర్మం గురించి ఎంతో కొంత ఆసక్తి కల్గుతున్నది. పుస్తకాలద్వారానో, స్నేహితులద్వారానో, వెబ్‌సైట్‌లద్వారానో తెలుసుకొంటున్నారు. ఇలా తెలుసుకొని ద్వేషించేవారు కొందరు ఉండవచ్చు. సైలెంట్‌గా ప్రశంసించేవారు, లేదా నిర్లిప్తంగా - వారి నమ్మకాలు వారికి అని భావించేవారు ఎక్కువగా ఉంటారు. ఈ బ్యాక్‌గ్రౌండ్‌లో మా వివాహం - మా పెద్దల సమక్షంలో జరగడం - చాలా ఆసక్తిదాయకంగా - ఏ విధమైన టెన్షన్ లేకుండా జరిగింది."

"హిందూ ధర్మమూ, జీవన విధానము సముద్రంలాగా విశాలమైనవి. ఎంతో లోతైనది. ఎప్పటికి ఎండిపోనివి, వట్టిపోనివి. అన్ని నదులూ సముద్రంలో వచ్చికలుస్తాయి. సముద్రంలో వచ్చికలసిన తర్వాత తమ పాత అస్తిత్వాల ప్రస్తావనే ఉండదు. ఆ మహాజలధిలో అన్ని బింధువులూ సమానహోదాలో, ఏ విధమైన తేడాలూ లేకుండా కలసిమెలసి నర్తిస్తాయి" అంటూ ఎవరో స్వామిజీ చెప్పిన విషయాలు శారదకు స్ఫురించాయి. ఆ మాటపైకి చెప్పింది.

"అవును, నిజమే. మనమంతా సింధువులో బింధువులం" అన్నది ఉమ. శంకర్, సాలగ్రామ్ ఆమోదసూచకంగా తలలూపారు.

(జాగృతి, తేది. 7-2-2011)

-- x --

